

మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

# మట్టి వినాయకులనే పూజించాలి

## జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన 2500ల మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణతో పాటు, వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరు మట్టితో చేసిన వినాయకులనే వినియోగించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన సుమారు 2500ల మట్టి గణపతులను గురువారం ఆమె సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో సిబ్బందికి, కార్యాలయానికి వచ్చిన వారికి పంపిణీ చేశారు. వినాయకచవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసిన విగ్రహాలను వాడడం వల్ల వాతావరణం కలుషితం అవుతుందని అంతేకాక నిమజ్జనం చేసినప్పుడు నీరు సైతం కలుషితమవుతుందని ఇది హాని కలిగిస్తుందని, అందువల్ల ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వాడాలని కోరారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, కలెక్టర్ కార్యాలయ శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




# లంభోదర నమస్తుభ్యం..

- శివపార్వతుల ముద్దుల తనయుడు..
- ఉండ్రాళ్ల ప్రియుడు.. వృకోధరుడు..
- ఏకదంతుడు..వక్రతుండుడు..
- వినాయక చతుర్థి నేడు..

**భూత్పూర్,సెప్టెంబర్ 6,ప్రభాతవార్త :** సకల దేవతలు,ప్రమధ గణాలలో అగ్రగణ్యుడు..అగ్ర తాంబూల గ్రహీత..శివపార్వతుల ముద్దుల తనయుడు..ఉండ్రాళ్ల భోజన ప్రియుడు. వృకోదురుడు..వక్రతుండుడు..ఏకదంతుడు..విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు..లంభోదరుడైన వినాయకుని పుణ్యజన్మదినం..దీన్ని వినాయక చతుర్థి అని కూడా అంటాం..ప్రతీ ఏటా భాద్రపద శుద్ధ చవితి రోజు గణనాథుని పుట్టిన రోజు.వినాయకుని పుట్టక ఓ పరమాత్ముని సంకల్పమనే చెప్పాలి.ఒక శుభ ఘడియన లోకమాతయైన జగన్మాత పార్వతి పరమేశ్వరుడడైన శివుడు కైలాసానికి వస్తున్నాడని తెలిసి నలుగుపిండి,పసుపుతో స్నానమాచరింప తలంచి నలుగుపిండి అచేతనంగా చిన్న ముద్దు బొమ్మలా మారితే.అప్పుడు పార్వతి ఈ బొమ్మప్రాణం పోసి ప్రాణ ప్రతిష్ఠ చేయగా, ముద్దు గణపయ్య ముద్దుముద్దుగా అందరికి దర్శనమిచ్చాడు.అలా లోకానికి గణపతయ్య పార్వతీదేవి అభీష్టపుత్రుడిగా వెలుగొందాడు.పార్వతి తాను స్నానమాచరించేందుకు వెళ్లున్నానని,లోపలికి ఎవరినీ అనుమతించదద్దని చెప్పడంతో,గణేషుడు ద్వారం వద్ద తల్లి ఆజ్ఞమేరకు కాపలాగా ఉంటాడు.ఇంతలో పరమేష్ఠి శంకరుడు లోపలి వెళ్లేందుకు ప్రయత్నించగా,గణేషుడు అడ్డుకుంటాడట.ముక్కోపియైన శంకరుడు తన త్రిశూలంతో గణేషుని తలను నరికివేయగా,ఇది చూసిన పార్వతి కన్నీరు మున్నీరుకాగా,శాంతించిన పరమేశ్వరుడు అసలు విషయం తెలిసి మిక్కిలి బాధపడి గణేశుని పునర్జీవితుని చేసేందుకు అతని తల స్థానంలో ఎన్నోఏళ్లుగా శివుని కోసం దీక్ష చేపట్టిన గజాసురుడైన ఏనుగు తలను నరికి తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తాడట.అయితే శివుడు గజాసురుని తలను నరకడంలో కూడా అంతరార్థముంది.గజాసురుడు శివుని కోసం ఘోర తపస్సు చేస్తాడట.అందుకు సంతసించిన శివుడు గజాసురుని వరం కోరు కోమనగా,అప్పుడు గజాసురుడు తన ఉదరంలో శివుని కొలువుదీరమని కోరతాడట.భోళాశంకరుడు అందకు సరేనని చెప్పి గజాసురుని ఉదరంలోకి వెళ్తాడట.సకల లోకాలను పాలించే పరమేష్ఠి ఓ ఏనుగు ఉదరంలో కొలువుండడమా అని బ్రహ్మవిష్ణువులు గంగిరెద్దు,దూడ రూపంలో గజాసురుని ముందు నాట్యం చేసి అతడిని మెప్పించగా,అప్పుడు బ్రహ్మవిష్ణువులతో పాటు సకల జనులు తన ఉదరం నుంచి శివుని విడుదల చేయాల్సిందిగా ప్రార్థిస్తారట. అందుకు సంతసించిన గజాసురుడు శివుడిని తన ఉదరం నుంచి విడుదల చేస్తాడట.పరమేష్ఠి శివుడు ఏదైనా వరం కోరుకోమనగా,అప్పుడు గజాసురుడు తనకు చిరంజీవత్వాన్ని ప్రసాదించి ఎల్లప్పుడు తన ముఖంతో ప్రపంచం చూసేలా వరం ఇవ్వమని కోరగా,అందుకు శివుడు సమ్మతించి సరేనంటాడట. అప్పటన్నుంచి శివునిచే నరకబడిన వినాయకుని తలకు గజాసురుని తలను అంటించి.,గజాసుర తలతో ఉన్న విఘ్నేశ్వరుడికి ప్రథమ పూజ చేశారట. అప్పట్నుంచి ప్రమధగణాలకు అధిపతిగా,పూజలలో అగ్రతాంబూలం పుచ్చుకునేలా పార్వతీపరమేశ్వరులు గణేశుని ఆశీర్వదించారట.గణేశుడిని తల్లి పార్వతి గణేశుని నీకేమిష్టమని అడుగగా,ఉండ్రాళ్లు కావాలని కోరాడట.బొజ్జనిండా ఉండ్రాళ్లు సేవించి ఎలుకపై ఊరేగుతుంటే గణేశుని చూసి ఆకాశంలో చంద్రుడు పకపకా నవ్వాడట.అందుకు కోపగించిన వినాయకుడు ఈ చవితి నాటి చంద్రుని చూసిన వాడికి అవమానాలు జరుగుతాయని వినాయకుడు చంద్రుడికి శాపమిచ్చాడట. అయితే తనను ప్రతి – మిగతా4లో..



# నిర్లక్ష్యానికి .. నిలువుటద్దాం..!

- కాసుల కక్కుర్తితో నాణ్యతకు తిలోదకాలు...
- రూ.7.60కోట్లు మట్టి పాలేనా.?
- నాణ్యత లేని నిర్మాణాలతో ప్రజాధనం దుర్వినియోగం
- అవినీతి కొరల్లో అధికార యంత్రాంగం



చెక్ డ్యాం దృశ్యం

**వంగూరు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం వాగులు, వంకలపై చెక్‌డ్యాంలను నిర్మించి ఎగువ ఉన్న నీటిని నిల్వ చేసి భూగర్భజాలలను పెంచి సమీప గ్రామాలు, వ్యవసాయ పొలాల్లో ఉన్న బోరు బావుల్లో నీటి మట్టం పెరిగి ప్రజలు, రైతులకు తాగు, సాగునీటికి కొరత లేకుండా చూడాలనే సంకల్పంతో కోట్ల రూ॥ల నిధులు మంజూరు చేస్తే క్రింది స్థాయి అధికారులు, గుత్తేదారులు మాత్రం నిర్లక్ష్యం వహించి నాణ్యత లేని నిర్మాణాలు చేపట్టి ప్రజాధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారనడానికి నిదర్శనంగా మిట్టసదగోడు గ్రామ సమీపంలోని దుందుభీ వాగులో నిర్మించిన చెక్ డ్యాం నిదర్శనంగా నిలుస్తోంది. కోట్ల రూ॥లను వెచ్చించి, రైతు, ప్రజల శ్రేయస్సు కోసం తాగు, సాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదనే సంకల్పంతో ప్రభుత్వాలు ముందడుగు వేస్తుంటే... గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని నాణ్యత లేని నాసిరకంగా నిర్మాణాలను చేపట్టి తమ జేబులను నింపుకుంటున్నారే తప్ప ప్రజా ప్రయోజనమనే ఆలోచనను మరిచి తమ ఇష్టానుసారంగా కట్టడాలను చేపట్టి అందినకాడికి దోచుకుంటున్నారే తప్ప బాధ్యతాయుతంగా నిర్మాణాలు చేపట్టడం లేదని చెప్పుకోవచ్చు. వంగూరు మండలం డిండిచింతపల్లి, మిట్టసదగోడు గ్రామాల పరిసిర ప్రాంతాల్లో ఉన్న దుందుభీ వాగులో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను నిలుపుదలకు మిట్టసదగోడు, జప్తి సదగోడు గ్రామాల మధ్యన రూ.7,60కోట్ల వ్యయంతో చెక్‌డ్యాంను నిర్మించారు. పనులు పూర్తికాక ముందే చెక్ డ్యాం విరగడంతో అనాటి ప్రతిపక్ష నాయకులు, నేటి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని నాణ్యతమైన నిర్మాణాలు చేపట్టాలని అధికారులను, గుత్తేదారులకు విన్నవించడంతో పనులు త్వరితగతిన పూర్తి చేశారు. కానీ పనులు పూర్తి కాక ముందు దుందుభీ వాగులో ఏర్పాటు చేసిన చెక్ డ్యాం మధ్యలో పూర్తిగా ధ్వంసం కావడంతో పలువురు అనాడే ముక్కున వేలేసుకున్నారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను గుత్తేదారులు,క్రింది స్థాయి అధికారులు కుమ్మక్కై నాణ్యతగా నిర్మించాల్సిన చెక్ డ్యాంలను, వంతెనలను నాసిరకంగా నిర్మించడంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులన్ని మట్టిలో కలువాల్సిందేనా అని – మిగతా4లో..

### నిర్లక్ష్యపు ధోరణిలో కాంట్రాక్టర్ల సమాధానం...

**మిట్ట సదగోడు, జప్తి సదగోడు గ్రామాల మధ్య నిర్మించిన చెక్ డ్యాం వరద నీటికి కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న విషయాన్ని సదరు కాంట్రాక్టర్‌తో వివరించగా నిర్లక్ష్యమైన సమాధానమిస్తున్నారు. మేము బాగానే నిర్మించాము కానీ వరద నీటికి పోయిందని, దానికి మేమేం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన నిధుల కంటే ఎక్కువ నిధులు వెచ్చించి నిర్మించామని, వరద నీటికి కుంగిపోతే మేమేం చేయాలని నిర్లక్ష్యపు సమాధానాలిస్తున్నారు. ఇలాంటి గుత్తేదారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి గుత్తేదారులతో చేతులు కలుపడమే నాసిరక నిర్మాణాలకు తావు తీస్తుందని అధికారులు, గుత్తేదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని కోతకు గురైన చెక్ డ్యాం పనులను చక్కదిద్దాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.**



విరిగిన చెక్ డ్యాం ఫైల్



చెక్ డ్యాం ముందు భాగంలో నిర్మించిన బెస్ బేగం లేచిన దృశ్యం

# రైతులు ఆందోళన పడవద్దు..

- భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి...!!
- పరిసర ప్రాంతాల్లో నిలువ నీరు ఉండకుండా చర్యలు: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** పరిసర ప్రాంతాల్లో నిలువ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఉదయం నుండి పెద్దమందడి మండలంలోని జంగమాయ పల్లి, ఘణపూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గనప సముద్రం రిజర్వాయర్, కర్నె తండా, గోపాల్‌పేట మండలంలో పర్యటించారు.వ్యవసాయ రుణ మాఫీ కానీ రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.పెద్దమందడి మండలంలోని జంగమాయ పల్లిగ్రామంలో వ్యవసాయ రుణమాఫీ కానీ రైతుల నుండి వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులు తీసుకొని ఆన్లైన్ దరఖాస్తు చేస్తున్న సందర్భంగా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ రైతులు ఆందోళన పడవద్దని వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హులైన 25 మంది రైతులకు రుణ మాఫీ కావాల్సి ఉందని వ్యవసాయ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అన్ని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని జి.సి.డి.ఒ శుభలక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. ఘణపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక డెంగ్యూ కేసు నమోదు అయిన నేపత్యంలో కలెక్టర్ విద్యాలయాన్ని సందర్శించారు. డెంగ్యూ నమోదు కావడానికి గల కారణాలను వైద్య సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాలలో శుభ్రత చేయించాలని, నిలువ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ఎందుకు వస్తాయి అనేది విద్యార్థులకు అవగాహన కల్పించారు.



వ్యవసాయ అధికారులతో మాట్లడుతూ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

### గనప సముద్రం రిజర్వాయర్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

గనప సముద్రం రిజర్వాయర్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముందుగా సర్వే చేసిన భూమికి పెగ్మార్కింగ్ పూర్తి చేయాలని, అవార్డు పాస్ చేసి ఇరిగేషన్ అధికారులకు స్థలం అప్పగించాలని సూచించారు. అనంతరం కర్నె తాండ సందర్శించి అక్కడ నీవసిస్తున్న వృద్ధాశ్రమ భవనం, నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ భవనానికి విద్యుత్, దర్వాజలు త్వరగా అమర్చి పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ ను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి, జి.సి.డి.ఒ శుభలక్ష్మి, ఘణపూర్ తహశీల్దార్ పాండు, ఎంపిఓ తదితరులు కలెక్టర్ వెంట న్నారు.

# నీటితో కళకళలాడుతున్న కోయిల్‌సాగర్



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు షెట్టర్లు తెరిచిన దృశ్యం

- ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- 5 షెట్టర్లు తెరచి దిగువకు నీటి విడుదల
- మళ్లీ పెరిగిన కోయిలకొండ,అంకిళ్ళ వాగుల ప్రవాహం
- 32.6 ఫీట్లకు చేరిన నీటి నిల్వ

**దేవరకద్ర,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** వర్షం కురవడంతో జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి మళ్లీ బాగా పెరిగింది.దీంతో శుక్రవారం ప్రాజెక్టు 5 షెట్టర్లను ఫీటు ఎత్తు తెరచి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టుకు 13షెట్టర్లు ఉన్నాయి.అందులో 5షెట్టర్లను తెరిచారు.అయితే ముందు జాగ్రత్తగా ఈ నెల1న ప్రాజెక్టు 11 షెట్టర్లను తెరిచారు. రోజు రోజుకు ప్రాజెక్టులోకి వచ్చి చేరే నీటి ఉధృతి తగ్గినట్లే తగ్గి మళ్ళీ పెరిగింది. కోయిల్ సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు.ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు 32.6 ఫీట్లకు వచ్చి చేరింది.వర్షం కురవడంతో ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ,కోయిలకొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరడం ప్రారంభమైంది. దీంతో ప్రాజెక్టులో నీటి స్థోమత పెరిగింది. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరడంతో కోయిల్‌సాగర్‌కు జలకళ వచ్చింది. జలసవ్వడి – మిగతా4లో..

# మండపాల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

- భద్రతా, బందోబస్తుకు సులువుగా ఉంటుంది
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడి



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకు ని పోలీస్ వారికి సహకరించాలని ఎస్పీ డి.జానకి పేర్కొన్నారు. అప్లికేషన్ నమోదు చేయుటకు వాడాల్సిన లింక్ హెచ్‌టిటిపిఎస్://పోలీస్‌పోర్టల్.టిఎస్‌పోలీస్.జిఓవి.ఇన్/ఇండెక్స్.హెచ్‌టిఎం పోలీస్‌శాఖ వారు రూపొందించిన గణేష్ మండలం నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని తెలిపారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని, ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్‌కు ఎటువంటి రుసుము లేదని ఎస్పీ తెలిపారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదని ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత పోలీస్ వారికి లేదా డయల్ 100కి కానీ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 సమాచారం అందించాలని సూచించారు. ఈ పండగను అందరం శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

# మట్టి గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించాలి...

గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్...



కలెక్టర్ నుండి మట్టి గణపతులను అందుకొన్న ఉద్యోగులు

**గద్వాల,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్బంగా పర్యావరణ పరిరక్షణకు సహకరించడానికి మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గరువారం – మిగతా4లో..

# పౌష్టికాహార లోపాన్ని నివారించాలి..

- గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించాలి
- వైద్యారోగ్య శాఖ, ఐసిడిఎస్ సమన్వయంతో పని చేయాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి ఆదేశం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంత మురికి వాడలోని 5 సంవత్సరాల లోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహార కార్యక్రమంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 5 సంవత్సరాలలోపు పిల్లలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, యుక్త వయసు బాలికలకు వివిధ రకాల పౌష్టికాహార కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికి నేటికి గ్రామీణ ప్రాంతాలలో 5 సంవత్సరాలలోపు పిల్లలు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం, బరువు తక్కువగా ఉండడం, వయసుకు తగిన బరువు లేకపోవడం వంటి కారణాలతో అనేక మంది చిన్నారులు ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, దీంట్లో భాగంగా 5 సంవత్సరాలలోపు పిల్లల పోషణ, ఆరోగ్యం పరిశుభ్రతలపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతా యని, ఆరోగ్యం, పౌష్టికాహా రం 2 చాలా ముఖ్యమైనవి అని ప్రత్యేకించి మానవ జీవితంలో 5 సంవత్సరాలో పు వయసు అత్యంత కీలకమై నదని, వారి భవిష్యత్తు ఆరో గ్యం పౌష్టికాహారం పైనే ఆధారపడి ఉందని తెలిపారు. ప్రతినెల మొదటి తేదీన తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపంతో బాధపడుతున్న వారు, అలాగే బరువు తక్కువ, వయసుకు తగిన బరువు లేకుండా చిన్న పిల్లల బరువు పెరుగు దలను పర్యవేక్షించాలని, వారి బరువులను క్రమం తప్పకుండా రికార్డు చేయాలని అన్నా రు. వచ్చేనెల నుండి జిల్లా, మండల స్థాయి అధికారులు అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి పిల్లల పెరుగుదల నమోదు సక్రమంగా జరుగుతున్నది లేనిది పర్యవేక్షించాలని చెప్పారు. అంతేకాక వారి వివరాలను రికార్డు చేస్తున్నది లేనిది దగ్గరుండి పరిశీలించాలని అన్నారు. అతి తీవ్ర పోషణ లోపంతో బాధపడే పిల్లల ఇంటికి వెళ్లి వారి పౌష్టికాహారం తనిఖీ చేయాలని, వారు పౌష్టికాహారం వాడుతున్నది లేనిది పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పౌష్టికాహారంపై రూపొందించిన గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం పిల్లలు పౌష్టికాహారం లోపంతో బాధపడకుండా రక్షించుకుంటామనే ప్రతిజ్ఞను చేయించారు. జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, జిల్లా వైద్యారోగ్య అధికారి డా.పద్మ మాట్లాడుతూ రాష్ట్ర శిశు సంక్షేమశాఖ కన్సల్టెంట్ రాహుల్ పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహార కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మజ, జిల్లా మలేరియా అధికారి డా.భాస్కర్‌నాయక్ కార్యక్రమానికి హాజరయ్యారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి, జిల్లా అధికారులు

## అట్టహాసంగా గురుపూజోత్సవం

**రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమంలో ఉపాధ్యాయులకు ఘన సత్కారం**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** భారతరత్న డా. సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఏనుగొండలోని రెడ్‌క్రాస్ సన్నిధి ఆశ్రమంలో గురు పూజోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన ఈ వేడుకలకు రెడ్‌క్రాస్ కోశాధికారి సురభి జగపతిరాయ్, ఎంసి మెంబర్, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ బాబుల్‌రెడ్డి, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ మేనేజర్ నరసింహులు, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ దేశానికి సర్వేపల్లి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని కోరారు. అనంతరం సన్నిధి ఆశ్రమంలో గురుతరమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ, శాంతివన్, సన్నిధి ఆశ్రమఉపాధ్యాయులుగా విశిష్ట సేవలందిస్తున్న శోభరాణి, శిరీష, సునంద, రాజేశ్వరిదేవి, యాదమ్మ తదితరులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అంతేకాకుండా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి పసైందన విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్, సన్నిధి ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దాడులు జరగకుండా చూడాలని ఎమ్మెల్యేకు వినతి

**మక్తల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మక్తల్ ప్రాంతానికి చెందిన తాము వర్షాకాలంలో గొర్రెలను మేపేందుకు నల్లమల అడవులే ఆధారమని, కానీ ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో తమపై దాడులు చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీన్ని నివారించి తమపై జరుగుతున్న దాడులను అడ్డుకునేలా చూడాలని గొర్రెల పెంపకందారులు శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

స్థానికంగా గొర్రెలు మేపేందుకు స్థలము లేనందున ఎన్నో వ్యయ ప్రయసాలు ఎదుర్కొని నల్లమల అడవులకు తరలి వెళ్తున్నామన్నారు. అయితే అక్కడి ఫారెస్టు సిబ్బంది గొర్రెల కాపరులపై దాడిచేసి వంట వండుకునే సామాగ్రిని సైతం తీసుకువెళ్తుండడంతో దిక్కుతోచని స్థితిలో అడవుల్లో పస్తులు ఉంటున్నామన్నారు. మక్తల్‌ప్రాంతంలో అధికంగా ఉన్న గొర్రెలకాపరుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి దాడులు జరగకుండా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో లంకాల మహేష్, గుడిగండ్ల రమేష్, జక్లేర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

**గోపాల్‌పేట సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** గోపాల్‌పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగినదని పాఠశాలప్రధానోపాధ్యాయులు రమాకాంత్ తెలిపారు. వివరాలలోకి వెళితే ఈ నెల 10వ తేదీ నుండి మధ్య ప్రదేశ్ లో జరుగబోతున్న జాతీయస్థాయి అసోసియేషన్ సబ్ జూనియర్ బాలికల పోటీలకు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థినిలు తెలంగాణ జట్టుకు ఎంపిక కావడం జరిగిందని ఆగష్టు 20వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కల్వకుర్తిలో నిర్వహించిన కోచింగ్ క్యాంప్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన 22 మంది బాలికలను జాతీయ పోటీలకు ఎంపిక చేయడం జరిగింది.



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

అందులో భాగంగా గోపాల్ పేట జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి శైలజ, స్వరూప జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల పిడి, పాఠశాల ఉపాధ్యాయ బృందము అభినందించడం జరిగింది.

## శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో గణిత జ్ఞానమేళ

**అమరచింత సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గణిత జ్ఞాన విజ్ఞాన మేల నిర్వహించారు. గణిత జ్ఞాన విజ్ఞానమేలలో వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో శిశుమంది విద్యార్థులు పాల్గొని గణిత, సైన్స్ సంబంధించిన ప్రయోగాలు తయారుచేసిన విద్యార్థులు వివరించడం జరిగింది.





అమరచింతలో శ్రీ సరస్వతి శిశు మందిర్ లో గణిత విజ్ఞానమేళ కార్యక్రమం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు గణిత, సైన్స్ చాలా వినూత్నమైన ప్రయోగాలు చేయడం అభినందనీయమనీ విద్యార్థులను అభినందించారు. అలాగే శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన జ్ఞాన విజ్ఞానమేలలో విద్యార్థులు తయారుచేసిన ప్రయాగాలను చూడడానికి పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గణిత జ్ఞాన విజ్ఞాన మేళలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు ఎంఈఓ బాస్కర్ సింగ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విజయ్, సౌజన్య రెడ్డి, మేరువా రాజు, ఎల్లా బాలస్వామి, సత్యనారాయణ, రాజు మల్లేష్, రమేష్ నాయక్, జన్ను నాగరాజ్ వీరితోపాటు వనపర్తి జోగులాంబ గద్వాల్ జిల్లాల శిశు మందిర్ ఆచార్యులు మాతాజీలు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని తయారుచేసి విద్యార్థులు

**మూసాపేట, సెప్టెంబరు06 ప్రభాతవార్త:** మండలంలోని చక్రాపూర్ ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలతో మట్టి గణపతిని తయారు చేసి పర్యావరణాన్ని రక్షించాలంటే మట్టి గణపతిని పూజించాలి అంటున్న విద్యార్థులు ప్రతిభను గ్రామ యువకులు ఉపాధ్యాయులు అభినందించారు. మట్టి గణపతి తయారు చేసిన విద్యార్థులను అభినందిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విద్యాలత మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించి భావితరాలను కాపాడాలని పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజించడం శ్రేయస్కరమని ప్రకృతి వరప్రసాదమైన మట్టి విగ్రహాలను ఉపయోగించి మన చెరువులను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, ఎం. లక్ష్మీనారాయణ, మోహన్ బాబు, రాజు, బి. లక్ష్మీనారాయణ, గ్రామ యువకులు సుదర్శన్‌గౌడ్, జి. భూపతి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి గణపతులను తయారు చేసిన విద్యార్థులు

## ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**అమరచింత సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులకు శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని డిఎంఆర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాం పాషా మాట్లాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణ చూపిన మార్గంలో విద్యార్థులు ఎన్నో శిఖరాలను అందుకున్నారని ఆయన జయంతి ఉపాధ్యాయ బృందానికి ఆదర్శమని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన విద్యార్థులను కోరారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు రాములు ,ఆనందలక్ష్మి ,హరిత ,జ్యోతి ,శ్రావణి, శ్రీలత రిటైర్ట్ ఉపాధ్యాయులు షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం...

**గద్వాల, గద్వాల టౌన్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్త దానం చేయడంతో అనారోగ్యాల భారిన పడిన వారిని కాపాడినవారవుతారని, నా జన్మదినం సందర్భంగా రక్త దానం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుచున్నానని జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకర్గ ఇంచార్జీ సరితమ్మ అన్నారు. శుక్రవారం తన జన్మదిన సందర్భంగా జరితమ్మ దళం ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సరితమ్మ, మున్సిపల్ చైర్మన్ బి.ఎస్. కేశవ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సరితమ్మ మాట్లాడుతూ రక్తదానంతో మరొకరి జీవితానికి వెలుగును నింపవచ్చని, సమయానికి రక్త అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పుతున్నారని వారందరినీ కాపాడిన వారవుతారని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు, ఈ సందర్భంగా 200 మంది రక్తదానం చేశారు. అనంతరం



సరితమ్మ జన్మదిన వేడుకల్లో చైర్మన్ కేశవ్

రక్తదానం చేసిన దాతలను, యువతను అభినందిస్తూ సరిత తిరుపతయ్య ప్రశంస అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దొడ్డి రామకృష్ణ, రాజశేఖర్, రెడ్డి, కోటేశ్, ఆనందర్ గౌడ్, నాగేందర్ యాదవ్, భాస్కర్ యాదవ్, నరహరి

### రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు...
### జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల అసెంబ్లీ ఇంచార్జ్ సరితమ్మ...



రక్త దానం చేస్తున్న సరితమ్మ అభిమానులు

గౌడ్ గద్వాల గవర్నమెంట్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ వినీమ, టెక్నికల్ సూపర్ వైజర్ రామకృష్ణ, పిఆర్ఓ రాకేశ్, టక్నిషన్స్ ఖాలీల్ , నరేష్, మల్లికార్జున్, వెంకటేశ్వర రెడ్డి, స్టాఫ్, నర్సులు రేణుక, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# పిఓసితో పర్యావరణానికి ముప్పు..

**మట్టి ప్రతిమలే శ్రేయస్కరం.. ఎన్టీఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మ అనురాధ**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పిజి అటానమస్ కళాశాలలో వినాయక చవితి సందర్భంగా విద్యార్థినిలను ప్రోత్సహించడానికి పర్యావరణ అనుకూలమైన మట్టి గణపతి ప్రతిమల తయారీ పోటీని ఇకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. పద్మ అనురాధ ఈ పోటీకి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ వినాయక చవితి అనగానే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద పెద్ద వినాయకులే గుర్తుకు వస్తాయి. వీటితో పర్యావరణానికి హాని కలుగుతుందని అందరూ తెలుసుకుని ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరికి మట్టి గణపతులపై అవగాహన పెరిగింది. సహజమైన మట్టితో తయారు చేసిన 200ల గణేష్ ప్రతిమలను కళాశాల చుట్టు పక్కల కాలనీ వాసులకు, దుకాణదారులకు ఉచితంగా పంపిణీ చేయడం చాలా అభినందనీయమని,



మట్టి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థినులు

ఎకో ఫ్రెండ్లీ పద్ధతుల్లోకి మూరే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈకో క్లబ్ కమిటిసభ్యుడు డా. కె. సుధీర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కారణంగా పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం ఉంటుందని అందరు కూడా మట్టి గణపతిని ఉపయోగించే విధంగా చేద్దాం అప్పుడే ఈ గణేష్ చతుర్థి నిజమైన పర్యావరణ పండగ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, సైన్సెస్ గ్రూపులకు చెందిన విద్యార్థినిలు పోటీలో పాల్గొని బహుమతులు అందుకున్నారు.

# దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**- అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**దేవరకద్ర, సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ఆకుతోట కవిత అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.



**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్ర నామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామృతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళ హారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీ, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# సిడిపిఓ దమయంతి ఆధ్వర్యంలో ఉప్పునుంతలలో పోషకమాసం

**ఉప్పునుంతల, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** ఐసిడిఎస్ బల్మూరు ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ దమయంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకమాసంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హాజరైన వారు వేర్వేరుగా మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న పోషక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తీసుకుని ఆహారం గురించి, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం, ఆరోగ్యలక్ష్మి భోజనం, అంగన్‌వాడి కేంద్రంలో జరిగే ఈ స్కూల్ గురించి సిడిపిఓ దమయంతి వివరించారు. ప్రభుత్వం సకాలంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అందిస్తున్న పోషకాహారం, బాలామృతం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు అదేవిధంగా ప్రతిరోజు మనంతీసుకునే ఆహారం గురించి, పిల్లల ఎత్తులు, బరువుల గురించి అవగాహన సిడిపిఓ వివరించారు.



పోషకమాసంలో పాల్గొన్న అధికారులు

కార్యక్రమంలో బల్మూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు, ఉప్పునుంతల మండల సిడిపిఓ దమయం తి, తహసిల్దార్ సునిత, వైద్యాధికారిణి డా. స్వప్న, మండల పంచాయతీ అధికారి నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ బిపాషా, అంగన్‌వాడి కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్‌వాడి కేంద్రం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే స్కూల్‌ను పరిశీలించిన వైద్యాధికారి

**అడిషనల్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి**

**పెబ్బేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్ లో ఫ్రైడే డ్రైడే సందర్భంగా జిల్లాలోని హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ భాగంగా పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే, కస్తూర్బా గాంధీ స్కూల్ కు అడిషనల్ జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి సందర్శించి, స్కూల్ గదులను, వంటశాలను పరిశీలించి, విద్యార్థినులకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి వివరించి, సిమెంట్ ట్యాంకుల్లో, పూల కుండీలలో, కూలర్లలో, చిన్న చిన్న పాత్రలో నీళ్ల నిలువ ఉంటే అందులో దోమలు గుడ్లు పెడతావి యాంటీ గుడ్లు లార్వాగా పెరిగి దోమలుగా తయారవుతాయి



ఎంజాయ్ ది స్కూల్లో సందర్శించిన జిల్లా వైద్యాధికారులు

అందుకోసం ప్రతి శుక్రవారం రోజు నీళ్ల నిలవకుండా పారబోయాలి, అలాగే విద్యార్థినుల వాష్ రూమ్ పోయిన తర్వాత, భోజనము ముందు తప్పనిసరిగా హ్యాండ్ వాష్ సూత్రాలు పాటించాలని చెప్పారు. ప్రతి గురువారం రక్తహీనత కు సంబంధించిన ఐరన్ పోలీక్ టాబ్లెట్లు వేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధకశాధికారి డాక్టర్ పరిమళ తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ అది శేషు, ఎం జె పి ప్రిన్సిపల్ కవిత, కేజీబీవీ ఎస్ఓ పద్మ, వైద్యాధికారులు శ్రీహరినత్ రెడ్డి, చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రుణాలు మాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి

**ఖిల్లాగణపురం సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** వ్యవసాయ రుణాలు మాఫీ కానీ రైతులు అధైర్యపడవద్దని ఆయా మండలాల వ్యవసాయ అధకారులు పరిశీలించి నివేదికలు పంపించాలని సూచించారు. ఘణపూర్ కస్తూర్బా బాలికల పాఠశాలలో ఒక డెంగ్యూ కేసు నమోదు మండలంలోని అన్ని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జి సి డి ఓ శుభలక్ష్మి కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో దానికి గల కారణాలను మండల వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో నిలువ నీళ్ల లేకుండా చూడాలని డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు రావడానికి గల కారణాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు అనంతరం ఘణపసముద్రం రిజర్వాయర్ పనులను పరిశీలించారు. భూసేకరణ పనులు త్వరగా చేపట్టాలని రెవెన్యూ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముందుగా సర్వే చేసిన భూమికి పెగ్గు మార్కింగ్ పూర్తిచేయాలని అవార్డు పాస్ చేసి ఇరిగేషన్ అధికారులకు స్థలం అప్పగించాలని సూచించారు. అనంతరం కర్రి తాండ సందర్శించి అక్కడ నిర్మిస్తున్న వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద నాయక్ ప్రత్యేక అధికారి సుధీర్ జిసిడి ఓ భూలక్ష్మి తహశీల్దార్ పాండునాయక్ ఈ ప్రమోద్ రావు ఏ ఈ రమేష్ నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్



గణపసముద్రం రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## విఘ్నాలు తొలగించు విఘ్నేశ్వరా..

**- వాడవాడలా కొలువుదీరనున్న గణనాథులు**

**- మండపాలను సిద్ధం చేసుకొన్న భక్తుల**

**- నేడు వినాయకచవితి**

**దేవరకద్ర, సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** దేవరకద్ర, కౌకుంట్ల మండలాలలో శనివారం జరుగు వినాయక చవితి వేడుకలకు ఆయా గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేసుకొన్నారు. ప్రతి ఏడాది వినాయకచవితి వేడుకలను మండల ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయతీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ వినాయకచవితి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నారు. దీనికి గాను ఆయా గ్రామాలలో వినాయకులను ప్రతిష్ఠించడానికి వినాయక మండపాలను సిద్ధం చేస్తున్నారు. వినాయక చవితిరోజు ఆయా గ్రామాలలో గణనాథులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాదిరిగా వినాయకులను ప్రతిష్ఠించి నిమజ్జనం చేస్తారు. వినాయకుల మండపాలను పోటాపోటీగా అలంకరిస్తున్నారు. ఇలా ప్రతిష్ఠించిన గణనాథులకు నిత్యపూజలు చేస్తారు. దీంతో ప్రతి రోజు ఆయా వినాయక మండపాలు భక్తులతో కిటకిటలాడుతాయి. దేవరకద్రతో పాటు కౌకుంట్ల మాండలాల్లోని ఆయా గ్రామాలలో వినాయక చవితి వేడుకలకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించనున్న రంగురంగుల వినాయకులు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. మహారాజ, కృష్ణుడు, తలపాగ గణేశ్, గోమాత గణేశ్, ఆయోధ్య వినాయకుడు ఇలా వివిధ రకాల వినాయకులను ప్రతిష్టిస్తున్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** ఇటీవల నారాయణపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కుమార్ విభీషణ్‌ను శుక్రవారం జ్యోతిరావుపూలే బిసి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మక్తల్ మండలం లింగంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించి విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాకిటి ఆంజనేయులు, ఈసరి శ్రావణ్‌కుమార్, నజీర్, రఘు, కుర్వ ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండలంలోని దాసర్‌దొడ్డిలో పోషణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానిక అంగన్‌వాడి కేంద్రంలో పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. గర్భం దాల్చిన మహిళలు వెంటనే అంగన్‌వాడి కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకుని క్రమం తప్పకుండా పోషకాహారాన్ని ఉచితంగా పొందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు బసవ లింగమ్మ, సువర్ణ, ఆయాలు కవిత, లక్ష్మి, నర్మద, ఆశా కార్యకర్త పార్వతమ్మ, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ





మట్టి వినాయకుడు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

**పెబ్బేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయకుడి విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా మట్టివినాయకుడినే ప్రతిష్ట చేసి పూజించాలన్నారు. ఇందువల్ల పర్యావరణాన్ని కూడా కపడినట్టవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, మేనేజర్ గణేష్ బాబు, జూనియర్ అసిస్టేంట్ భూరన్, బిల్ కలెక్టర్ కృష్ణయ్య, వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసిన విద్యుత్ శాఖ యస్‌సీ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ శాఖ యస్‌సీ వెంకటేశ్వర్లు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ అనేది సహజం. ఇటీవలే నాగర్‌కర్నూల్ జిల్లా విద్యుత్ శాఖ యస్.సీ గా విధులు బాధ్యతలు నిర్వహించిన వెంకటేశ్వర్లు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే బిజనపల్లి మండలం పాలెం,తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న 33కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణకు కృషి చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు మాట్లాడుతూ జిల్లాలోఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకో వాలని వారు సూచించారు. విద్యుత్ శాఖకు కావాల్సిన సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ జైపాల్, కిరణ్ తదితరులు ఉన్నారు.

## వరద నీటి నుండి రక్షణ కల్పించండి



భారీ వర్షాల వరద కారణంగా నీట మునిగిన పంట పొలాలు



ఒకటో వార్డులోని నివాస సముదాయాల వద్ద చేరిన మురుగునీరు

**ఆత్మకూర్ సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఒకటవ వార్డులో గడిచిన వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో గ్రామ సమీపంలోని పంట పొలాలు నీట మునగడమే కాకుండా వరదనీటి ఉధృతితో గ్రామంలో ఊటనీరు చేరి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ కేంద్రంలోని ఒకటో వార్డులో గడచిన నాలుగు రోజులుగా పంట పొలాలు నీట మునిగి వరద నీరు అధికంగా రావడంతో ఒకటవ వార్డులో ఇళ్లలోకి పడ్డనీరు ఊతగా మారి ఇళ్లలోకి ప్రవేశించడంతో దుర్గంధ భరితంగా తయారవుతుందని తద్వారా రోగాల బారిన పడే అవకాశం ఉందని ఒకటో వార్డు కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ తక్షణమే స్పందించి వరదనీటిని మళ్లించే విధంగా చర్యలు చేపట్టి రోగాల బారిన పడకుండా తమను కాపాడాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా దాసరి కేశవులు, గణేష్



కలెక్టర్ ఆదర్శ సురభి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న దృశ్యం

**చిన్నంబావి,సెప్టెంబరు 06 ప్రభాత వార్త:** మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పెద్దమారూర్ గ్రామానికి చెందిన దాసరి కేశవులు, పెద్ద దగడకు చెందిన గణేష్‌లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గురువారం అందుకున్నారు.కొత్తకోట మండలం శంకిరెడ్డిపల్లి గ్రామంలో పని చేస్తున్న దాసరి కేశవులు చిన్నంబావి మండలం పెద్ద మారూర్ గ్రామంలో పని చేస్తున్న గణేష్‌లకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబభి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని నేటి బాలలే రేపటి పౌరులని సమాజ స్థితిగతిని మార్చే ఆయుధం ఉపాధ్యాయులకే గలదని సమాజా భివృద్ధికి తమకు మరింత బాధ్యత గుర్తు చేశారని అన్నారు.ఇరువురు ఉపాధ్యాయులు మండలానికి చెందినవారు కావడంతో పలువురు అభినందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు ఎన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వారిని ప్రశంసించారు. మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మూలె కేశవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త కళ్యాణ్‌రావు, బీచుపల్లి యాదవ్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకే ఫ్రైడే డ్రైడే : ఎంపిడిఓ రమణరావు



పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్న ఎంపిడిఓ

**చిన్నంబావి,సెప్టెంబరు 06 ప్రభాత వార్త:** పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని ఎంపిడిఓ రమణరావు అన్నారు. మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో ఎస్సీ హాస్టల్‌లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్ లో పరిసరాలు అన్ని కూడా పరిశీలించి వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని హాస్టల్లో పని చేస్తున్న సిబ్బందికి సూచించారు. హాస్టల్‌లో దోమల బెడద లేకుండా చూసుకోవాలని హాస్టల్లో పని చేస్తున్న సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు జ్వరం వచ్చిన వెంటనే సరైన పరీక్షలు నిర్వహించి చికిత్స చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిఓ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూపల్లి అరుణ్ జన్మదినోత్సవం



జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నంబావి,సెప్టెంబరు 06 ప్రభాత వార్త:** మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో జూపల్లి అనుచరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి భవిష్యత్ నాయకుడుగా జూపల్లి అరుణ్ రాబోతున్నారని,తండ్రికి తగ్గ తనయుడు కొల్లాపూర్ జనం మెచ్చిన యువ నాయకుడు భవిష్యత్ ఆశా కిరణం ప్రజల ఆశయ సాధకుడు, నిబద్ధత గల రాజకీయాలకు సరైన నాయకుడుగా ఎదగాలని ఆకాంక్షించారు. కొల్లాపూర్ ప్రాంతానికి అండగా ప్రజలందరికి దగ్గరగా ఉంటూ అందరి మన్న నలు అందుకుంటున్న జన నాయకుడు రత్నగిరి ఫౌండేషన్ నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలను చూపిస్తూ ముందుకెళ్తున్న మనందరి ఆత్మాయ నేస్తం జూపల్లి అరుణ్ అన్నారు.చిన్నంబావి మండల ప్రజల తరపున అరుణ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.కార్యక్రమంలో చిన్నంబావి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెబ్బేటి రామచంద్రారెడ్డి, ఇటిక్యాల కృష్ణప్రసాద్ యాదవ్, జంగ బీచుపల్లి యాదవ్, గజ్జి ఈదన్న యాదవ్, పసుపుల రంజిత్‌కుమార్,పెబ్బేటి తేజారెడ్డి, వడ్డెమాన్‌బిచ్చన్న,గంగారి శ్రీనివాస్, జగదీష్, బొల్లుశ్రీను, నరసింహ,యుగెందర్‌గౌడ్, వెంకటేష్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



ఉన్నత పాఠశాలకు డ్రమ్స్ మైక్ సెట్ విరళంగా అందజేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ సెప్టెంబరు 06 ప్రభాత వార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు అందించి చేయూత అందించడంతో పాఠశాలకు మైక్ సెట్ డ్రమ్స్ విరాళంగా అందజేశారు.1982 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు మైక్ సెట్ వితరణ ఇవ్వగా 79కి చెందిన విద్యార్థులు డ్రమ్స్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు.అంతే కాకుండా పాఠశాలఆవరణలోఅభివృద్ధి పరిచేందుకుగాను పూర్వవిద్యార్థుల సహాయ సహకారాలు ఆదర్శంగా తీసుకొని మరికొంతమంది విద్యార్థులు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధి కోసం చూయుతనం దించాల్సిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకర్ రావు, సంతోష్, విజయభాస్కర్ రెడ్డి తదితరులతో పాటుగా పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన పిసిసి అధ్యక్షుడి ఎంపిక పట్ల హర్షం

**పెబ్బేరు సెప్టెంబర్6 ప్రభాతవార్త:** తెలంగాణ నాల్గవ పిసిసి అధ్యక్షునిగా మహేష్ గౌడ్‌ని ఎంపిక చేసనందుకు అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. మల్లికార్జున కార్గే ఒక బీసీ నాయకులు పిసిసి అధ్యక్ష పదవి ఇచ్చినందుకు పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ రంజిత్‌కుమార్, మాజీ సర్పంచ్‌సురేందర్‌గౌడ్, రవీందర్ నాయుడు, నరసింహనాయుడు డైరెక్టర్ రాములు దయాకర్ రెడ్డి, శివ,ధూపం సర్వేష్ తదితర కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

# గురువులది గురుతరమైన బాధ్యత

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి : ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్**



**అచ్చంపేట, సెప్టెంబర్06 ప్రభాతవార్త:** సమాజాన్ని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురుతరమైన బాధ్యత గురువులకే దక్కిందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సన్మాన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, విద్యా శాఖ అధికారి గోవిందరాజులు ముఖ్య అతిథులుగా హాజరై సర్వేపల్లి రాధకృష్ణ, సరస్వతి దేవీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ భావి తరాలకు ఉపాధ్యాయులే ఆదర్శమని, విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని,విద్యార్థిని ప్రతిభావంతమైన విద్యార్థిగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా విద్యాబుద్దులు నేర్పించి దేశం నుంచి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న డీఈఓ, కలెక్టర్

ఎంతో మందిని విదేశాల్లో ఉన్నత విద్య స్థానంలో నిలిపా రంటే అది కేవలంగురువులకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులందరికి ఉపాధ్యాయులుఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి విద్యాబుద్దులు నేర్పించి సమాజంలో జరుగుతున్నటువంటి మంచి చెడులను విడమరిచి చెప్పివారిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోఉపాధ్యాయుల పాత్రకీలకమైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు స్థానికంగా ఉంటూ విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాఠశాలలోమౌళిక వసతులు కల్పిస్తూ అన్నిరకాలుగా వసతు లను సమకూర్చడంలో ప్రభుత్వం ముందుందన్నారు. అంతకు ముందు ఉపాధ్యాయులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌లతో కలిసి పూలమాలలు, శాలు వాలతోఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతకు అరగంట కేటాయించండి

■ **జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి**

**వనపర్తి టౌన్ 6 ప్రభాతవార్త:** ప్రతి ఆదివారం ఒక అరగంట పరిసరాల పరిశుభ్రతకు కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని జిల్లా బిసి అభివృద్ధి బీరం సుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ, ఏ బీ బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల చేత ప్రార్థన చేయించి వారికి అల్పాహారం స్వయంగా వడ్డించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని దోమల నివారణ పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు అందరూ ప్రతి ఆదివారం ఒక అరగంట కేటాయించి పరిసరాలు శుభ్రపరచుకోవాలని అన్నారు. నిలువ నీటిలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా కారకులైన దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయని వాటిని నివారించడానికి వసతి గృహ ఆవరణ పరిసర ప్రాంతాలలో నిలువ నీరు లేకుండా చూసుకోవడం ఒక్కటే మార్గమని అని అన్నారు. విద్యార్థులను వసతి గృహం దాబా పైకి తీసుకెళ్లి వాటర్ ట్యాంక్ లో ఎక్కువ రోజులు నిలువ నీరు ఉండడం వల్ల నాచు పేరుకుపోయి దోమలు గుడ్లు పెట్టడానికి అవకాశం ఉంటుందని విద్యార్థులకు స్వయంగా చూపించారు. వసతి గృహ ఆవరణ పరిసర ప్రాంతాలలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ సామాన్లు, టైర్లు,కొబ్బరి బొండాలు,సిసాలు, తదితరుల సామాన్లు ఆరు బయట మిద్దె పైన గాని పడేయటం వల్ల వాటిలో



బీసీ హాస్టల్‌ను సందర్శించిన జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

వర్షపు నీరు చేరి వారం రోజులు అలాగే ఉండిపోతే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయని వాటి వల్ల విషజ్వరాల బారిన పడవలసి వస్తుందని అన్నారు. అందుకని ప్రతి విద్యార్థి కూడా ప్రతీ ఆదివారం ఒక అరగంట కేటాయంచి పరిసరాల పరిశుద్ధతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని అన్నారు. విద్యార్థులకు విష జ్వరాలకు సంబంధించ ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే తగుచర్యలు తీసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించి చికిత్స అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారికి ఆదేశించారు. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారంగా నాణ్యమైన వేడి భోజనం అందించాలని వంటగది పరిసర ప్రాంతాలు ప్రతి రోజు శుభ్రపరచాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్ ఆంజనేయులు వసతి గృహ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 237 ఆలయాలకు పూజా సామాగ్రి పంపిణీ

**శ్రీకారం చుట్టిన నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్‌కుమార్**

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** నేడు వినాయక చవితిని పురస్కరించుకుని 237 పురాతన దేవాలయాలకు, వినాయక మండపాలకు పూజాసామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త, నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దిడ్డి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ దూప, దీప నైవేద్యంతో పాటు 33 రకాల పూజాసామాగ్రితో ఒక్కోకిట్‌ను తయారు చేసి స్వచ్ఛందంగా పంపిణీ చేస్తున్నామన్నారు. వినాయక మండపాలకు అవసరమయ్యే పూజా సామాగ్రి తోపాటు పురాతన దేవాలయాల్లో ప్రతిరోజు నిత్యపూజకు అవసరమయ్యే అన్ని సామాగ్రి అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి,గద్వాల జిల్లాలతో పాటు వరంగల్, కరీంనగర్, నల్గొండ ,రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో పలు దేవాలయాలకు ఈ దూప దీప నైవేద్యం కార్యక్రమం సామాగ్రినిపంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్నూల్,తిరుపతి, నంద్యాల,కడపతదితర జిల్లాల్లో సైతంపలు పురాతన దేవాలయాలకు, వినాయక మండపాలకు నేను సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పూజా సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లు ప్రవీణ్ తెలిపారు.

**సొంత డబ్బులతోనే..:** ఈ ధూప,దీప నైవేద్యం పంపిణీ కార్యక్రమంలో ఏ ఒక్కరినుండి ఒక్క రూపాయి చందాలు గాని, విరాళాలు గాని తీసుకోకుండా తమ సొంత డబ్బులతో నేను సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వినాయక మండపాలకు పూజ సామా గ్రిని పంపిణీ చేస్తున్నానని ప్రవీణ్ తెలిపారు. వినాయకుని ప్రతిష్టించిన రోజు నుండి నిమజ్జనం చేసే వరకు ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో నేను సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొందూరు శ్రీహరి,అశోక్,రెయిన్‌బో శ్రీనివాస్,శేఖర్‌రెడ్డి, గణేషరావు, శ్రీధర్, ఆస్కని నరెందర్,మధు, కృష్ణ, గడ్డం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పూజా సామాగ్రి అందజేస్తున్న దిడ్డి ప్రవీణ్‌కుమార్

# గ్రామాల్లో దోమల మందు పిచికారి చేయాలి

**జిల్లా సీజనల్ ప్రోగ్రాం అధికారి డా. అల్లె శ్రీనివాసులు**

**లింగాల,సెప్టెంబరు06 ప్రభాతవార్త:** గ్రామాల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సీజనల్ వ్యాధుల ప్రోగ్రాం అధికారి డా. అల్లె శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం లింగాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం పక్కన ఉన్న మురుగునీళ్లలో వైద్య సిబ్బంది ఎంపిడిఓ ఆంజనేయులు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం ఎంపిడిఓ ఆంజనేయులుకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి పంచాయతీలో వారానికి రెండు సార్లు దోమల మందు పిచికారి చేయించాలని సూచించారు. గ్రామాల్లో నీళ్ల నిల్వ ఉండకుండా చూడాలని నీళ్ల నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ తయారు చేసి వేయాలని అన్నారు. అనంతరం ఎర్రపెంట గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.దోమలనివారణపై సీజనల్‌వ్యాధులపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజనేయులు, లింగాల ప్రభుత్వ వైద్యాధికారి శివశంకర్, ఎంపిఓ చంద్రశేఖర్, ఆర్.శ్రీను, ఎఎంఓ వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మురుగునీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న వైద్య సిబ్బంది

## ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మండలంలోని ఆయా గ్రామాలలో ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసిల్దార్ కృష్ణయ్య ఓటరు జాబితాపై ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఓటరు జాబి తాలో ఓటరు మరణించారా లేక వలస వెళ్లారా, ఒక వార్డు నుంచి మరో వార్డులో నివాసం ఉంటున్నారా తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సర్వే 16వ తేదీలోపు పూర్తిచేసి ఓటరు జాబితాను ఆయా గ్రామాల సచివాలయంలో నోటీసు బోర్డులపై అంటిస్తామని ఆయన తెలిపారు.ఈ సర్వేలో ఆర్ఐ శశికిరణ్, బిఎల్ఓ కృష్ణవేణి ఉన్నారు.

## శాంతియుత వాతావరణంలో పడగలు జరుపుకోవాలి



**పెబ్బేరు సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం రోజు వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా మీటింగ్ పెట్టి వినాయకుని ప్రతిష్ఠించి కమిటీలను పిలిపించి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.శాంతియుత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలని మతం ద్వేషాలకు పోకుండా సామరస్యంగా నిర్వహించుకోవాలని రాత్రిపూట మైక్ సౌండ్ కుక్క పెట్టి ఇతరులకు డిస్టర్బ్ చేయరాదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కె ఎస్సై శ్రీనివాసులు జమిందార్ శ్రీనివాసులు కానిస్టేబుల్ రవి వివిధ పార్టీల నాయకులు యువకులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**గోపాల్‌పేట సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలం పోలికేపహడు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ స్కూల్ నందు ఇంగ్లీష్ బోదిస్తు ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వర చారి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయినందుకు గ్రామస్తులు శాల్వతో సన్మానించడం జరిగింది గ్రామస్తులు గద్దెరాములు మాట్లాడుతూ ఉత్తమఉపాధ్యాయులుగా ఎంపికైన ఈశ్వర చారి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తూ సమజంలో నేటి బాలలే రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయ వృత్తిని అంకిత భావంతో విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి విజయ వంతంలో దూసుకుపోతున్నారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తులు గద్దె రాములు, గుత్త అశోక్ రెడ్డి, ఎన్ శివ,మునీంద్ర గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను ఏర్పాటు చేద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

◆ **శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద్ పురోహిత్**

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడుకుందామని శక్తిపీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్ అన్నారు. శుక్రవారం శ్రీసంత్ మఠమూల మహాసంస్థానం శక్తిపీఠం ఆధ్వర్యంలో మట్టి గణపతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ స్వామి శాంతానంద పురోహిత్ మాట్లాడుతూ ఒక్కరూ మట్టి వినాయకులను స్థాపించి పర్యావరణ పరిరక్షణకై కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె అనసూయ చంద్రకాంత్, కాంగ్రెస్‌పార్టీ సదాశివరెడ్డి, పట్టణ అధ్యక్షులు మహ్మద్ సలీంతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు ఉన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగులు నిర్వహించుకోవాలి : సీఐ

**వెల్దండ, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** వినాయక చవితి పర్వదినాలను మతసామరస్యాలకతీతంగా ప్రతి ఒక్కరు కలిసి మెలిసి నిర్వహించుకోవాలని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెల్దండ మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఎస్ఐ కురుమూర్తితో కలిసి సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పండుగలు నిర్వహించుకోవాలని, వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రోడ్లన్ని బ్లాక్ చేయకుండా చూసుకోవాలని, మండపాల వద్ద మైక్ సౌండ్స్ అతిగి పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగాతమ వివరాలను ఇచ్చి నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

**వెల్దండ, సెప్టెంబర్06 ప్రభాతవార్త:** మండల కేంద్ర సమీపంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నల్లాల బావి వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో 5మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి నుంచిఆమనగల్లు వైపు వెళ్తున్నఆటో మేడిగడ్డ తాండకు చెందినపాండు,సోన, వెల్దండమండలంలోని జానల గట్టుతాండకు చెందినభీమా, మంజుల, రాచూర్ తండాకు చెందిన సక్రులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

**వెల్దండ, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన దశరయ్య ఏప్రిల్ నెలలో ఉపాధి హామీ పనులకు అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడుకు సంబంధించిన వివరాల నివేధికను జిల్లా అధికారులకు పంపించగా జాతీయ ఉపాధి హామీ పథకం నియమావళి ప్రకారం రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైనట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎక్స్‌గ్రేషియా డబ్బులను అతని కుటుంబ సభ్యులు సుభద్రమ్మ ఖాతాలో రూ.2లక్షలు జమ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.మృతుడి కుటుంబ సభ్యులు జిల్లా అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఎపీఓ ఈశ్వర్‌జీ, పీసీ దేవేందర్, టీఎ సత్యనారాయణ, అన్నపూర్ణ, ఆపరేటర్లు హుసేన్, రాము తదితరులు ఉన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు06 ప్రభాతవార్త :** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాల (అటానమస్)లో 2024,25 విద్యా సంవత్సరానికి గాను తెలుగు 3, హిందీ 1, ఉర్దూ 1, కామర్స్ 1, ఫిజిక్స్ 1, అప్లైడ్ న్యూట్రిషన్ 1, హిస్టరీ 3, పొలిటికల్ సైన్స్ 1, జువాలజీ 2, కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్ 1, బాటనీ 1, మ్యాథమెటిక్స్ 1 సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ॥ వి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. అభ్యర్థులు పిజి (పోస్టు గ్రాడ్యుయేషన్)లో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50% మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలి. నెట్/స్లెట్/సెట్ పిహెచ్‌డి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునే వారు అన్ని సర్టిఫికెట్ జిరాక్స్‌లతో మంగళవారం సాయంత్రం 4 గం.లలోపు ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మహబూబ్‌నగర్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం ఉదయం 10 గం.లకు ఎంవిఎస్ ప్రభుత్వ, ఆర్ట్స్ సైన్స్ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్‌లో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష) హాజరు కావాలని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## అంగన్‌వాడీ సెంటర్‌కు గ్యాస్ స్టౌ అందజేత

**చిన్నంబావి,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రత్నగిరి కాలనీలో అంగన్‌వాడి సెంటర్ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇటీవల అంగన్‌వాడి ఆయాను కేటాయించడంతో విద్యార్థులకు వంట కొరకు గ్యాస్ స్టవ్‌ను మీ శ్రేయోభిలాషి ఫౌండేషన్ డైరెక్టర్ పెరుమాళ్ల శ్రీనివాస్ అందజేశారు. గత ఐదేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన చిన్నంబావి గ్రామానికి నూతన అంగన్‌వాడి సెంటర్ మంజూరు కావడం జరిగిందని గత మూడేళ్లుగా అందులోచదువుకునే విద్యార్థులకు అంగన్‌వాడి టీచర్ ఒక్కరే కొనసాగుతూ ఉండడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విద్యార్థులకు వంట, వారి సంరక్షణకు అంగన్‌వాడి ఆయాను అధికారులు కేటాయించడంతో విద్యార్థులకు సమస్య తీరిందని, విద్యార్థుల వంట కొరకు సమస్యను గుర్తించి నూతన గ్యాస్ స్టవ్‌ను అందించడం జరిగిందని పెరుమాళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. చిన్నంబావి గ్రామానికి ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు గత సంవత్సరం క్రితం డీఈఓ, ఎంఈఓలకు వినతి పత్రం అందజేశామని ప్రస్తుత రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ప్రాథవమిక పాఠశాల మంజూరుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ మంజుల, అంగన్‌వాడి ఆయా, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో మాంసం వ్యర్థాల సేకరణకు రీటెండర్

◆ ఈనెల12వరకు దరఖాస్తులకు అవకాశం ◆ 13న వేలంపాట : మున్సిపల్ కమిషనర్ రాజయ్య

**జడ్చర్ల, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మాంసం వ్యర్థాల సేకరణకు రీటెండర్‌కు మున్సిపల్ కమిషనర్ రాజయ్య నోటిఫికేషన్ జారీ చేశారు. ఇదే నెల 2న వేలం పాట నిర్వహించగా గద్వాలకు చెందిన నర్సింహులు రూ.70లక్షల50వేలకు ఒక సంవత్సరానికి చికెన్, చాపలు,మటన్ వ్యర్థాల సేకరణకు టెండర్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే టెండర్ దక్కించుకున్న వ్యక్తి తాను సుముఖంగా లేక పోవడంతో వెనక్కి తగ్గడంతో మున్సిపాలిటీకి చేరాల్సిన భారీ ఆదాయానికి గండి పడిందని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా తిరిగి రీటెండర్ నిర్వహించేందుకు కమిషనర్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేయగా నేటి నుంచి ఈనెల 12వరకు దరఖాస్తులకు ఆహ్వానం పలికారు. 13న వేలంపాట నిర్వహించనున్నారు. వేలంపాటలో పాల్గొనదల్చినవారు దరఖాస్తు రుసుము రూ.15వేలు (తిరిగి చెల్లించనిది) చెల్లించి డిపాటిజ్ రుసుము రూ.2లక్షలు వసూలు చేసుకొనుటకు మున్సిపాలిటీలో ఈనెల13న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. కావునా దరఖాస్తుల చేయదలుచుకున్న వారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, పాన్ కార్డుతో దరఖాస్తులు రుసుము చెల్లించి రశీదు పొందాలని కమిషనర్ సూచించారు.

**ఆదాయం గండిపడినట్లేనా..:** మున్సిపాలిటీలో ఈనెల2న గద్వాలకు చెందిన వ్యక్తి రూ.70లక్షల50వేలకు వేలం దక్కించుకున్న విషయ తెలిసిందే. అయితే మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినట్లు అయితుందని అనుకున్న తరుణంలోనే టెండర్ దారుడు వెనక్కి తగ్గడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే కొందరు స్థానికులు టెండర్ దక్కించుకోవాలనుకోగా వేలం పాటలో తాము అనుకున్న డబ్బులకు మించి పాడడడంతో వేలం దక్కించుకోలేకపోయారు. ఇదే తరుణంలో టెండర్ దారుడు వెనక్కి తగ్గడంతో తాము ఎలాగైనా టెండర్ దక్కించుకోవాలనుకున్న వ్యక్తులు కావాలనే రీటెండర్ అయ్యేలా చక్రం తిప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈనెల 13న జరిగే వేలంపాటలో మాత్రం అంత పెద్ద మొత్తంలో వేలంపాట జరగకపోవచ్చని తెలుస్తున్నది.

## నిర్లక్ష్యానికి నిలువుటద్దాం..!

(మొదటి పేజీ తరువాయి)

పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో డిండిచింతపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగునీటిని అందించేందుకు నిర్మించిన వాటర్ ట్యాంక్ రాత్రికి రాత్రే ఒక ప్రక్క వరగడంతో అధికారులు చేసిన అవినీతి, నిర్లక్ష్యం మరిచిపోక ముందే ఆ గ్రామానికి సమీపంలో ఉన్న మిట్టసదగోడు గ్రామం దుందుభీ వాగులో నిర్మించిన చెక్ డ్యాం విరిగిపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు గుత్తేదారులు, అధికారులపై విశ్వాసం కోల్పోయారు. అధి కారులు, గుత్తేదారులు ఇచ్చే మాముళ్లకు బానిసలై గుత్తేదారులు నిర్మిస్తున్న చెక్ డ్యాంల్లో క్వాలిటిని పరిశీలించకపోవడం వల్లనే నిర్మాణాలు అధ్వాన్నంగా మారాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, గుత్తేదారులు చేపడుతున్న పనులను దగ్గరుండి చూసి క్వాలిటీ తగ్గకుండా చూసి నిర్మాణాలను చేపట్టే విధంగా చూడాల్సిన అధికారులే అవినీతి కొరల్లో చిక్కుకోవడంతో గుత్తేదారులు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి ప్రజాధానాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు ప్రజలకు అవస్థలు తెచ్చి పెడుతున్నారని సమాచారం.పనులు ప్రారంభించి పూర్తి చేసినతర్వాత ఎక్కడైన లోపాలు కనిపిస్తాయేమో కానీ... మిట్టసదగోడు గ్రామంలో నిర్మిస్తున్న చెక్ డ్యాం పరిస్థితి చూస్తే అధికారులు, గుత్తేదారుల పనితీరు ఏమిటో స్పష్టంగా అర్థమవుతోంది. ఇది ఇలా ఉండగా గత వారంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ఎక్కువగా రావడంతో చెక్ డ్యాం మరోసారి కుంగిపోవడంతో పాటు చేసిన బెస్‌మెంట్ వరద తాకిడికి దెబ్బతినడం చూస్తుంటే నిర్మించిన చెక్‌డ్యాం ఎంత నాణ్యతగాఉందో అర్థమవుతోంది.ఇదిఇలా ఉంటే మరోసారికూడా చెక్ డ్యాం విరిగిపోయే పరిస్థితి నెలకొంది.ఆయా గ్రామాలప్రజలు నాసిరక నిర్మాణాలను చేపట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు.

## నీటితో కళకళలాడుతున్న కోయిల్‌సాగర్

(మొదటి పేజీ తరువాయి)

చూపరులను మంత్రముగ్దులను చేస్తుంది.ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టులో కనుచూపు మేర నీరే కనిపిస్తుంది. ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరిందని తెలుసుకొన్న పర్యాటకులు ప్రాజెక్టును చూడటానికి అధిక సంఖ్యలో కోయిల్‌సాగర్‌నుచూడటానికి తరలివస్తున్నారు.కోయిల్‌సాగర్ ప్రాజెక్టుషెట్టర్లు తెరవడంతో బండర్‌పల్లి వాగు ఉధృతి కూడ పెరిగింది.బండర్‌పల్లి వద్ద అంతర్జాతీయ రహదారి పై ఉన్న పాత వంతెనను చెక్‌డ్యాంగా మార్చారు.అంతేగాకుండా ఈ వాగుపైపలు చెక్‌డ్యాంలను నిర్మించారు.దీంతో వాగు పరిసరగ్రామాలలో భూగర్భ జాలలు బాగా పెరిగాయి. వాగు పరిసరాలలో దాదాపు 20 గ్రామాలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర,చిన్నచింతకుంట,నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలాలలో ప్రాజెక్టు పరిదిలోకి వస్తాయి. దీంతో ఈ గ్రామాలలో వాగు ప్రభావం బాగా కనిపించింది.

## మట్టి గణపతి విగ్రహాలు ప్రతిష్టించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఐ.డి.ఓ.సి ఆవరనలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తయారు చేసిన 2000 మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల వినియోగం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారైన విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేయడమే కాకుండా, వాటిని నదుల్లో, సరస్సుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల అక్కడి జీవ వైవిధ్యానికి కూడా నష్టం జరుగుతుందని అన్నారు. కాగా, మట్టి గణపతి విగ్రహాలు సహజంగా కరిగి పోతూ, పర్యావరణానికి ఎటువంటి హానీ కలిగించవని పేర్కొన్నారు.పట్టణాలతో పాటు గ్రామాలలో కూడా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మట్టి గణపతులు గద్వాల్ కు 1000, అయిజ కు500, అలంపూర్‌కు 250, వడ్డేపల్లి 250 విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది. పర్యావరణ పరిరీక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, గణేష్ చతుర్థి పర్యావరణహిత పండుగగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు నర్సింగా రావు, శ్రీనివాసులు, ఏఓ వీర భద్రప, ఈడీ ఎస్సీ రమేష్, బాబు, డీఎం విమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన ప్రముఖులు




ఎమ్మెల్యే జిఎంఆర్ తండ్రికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

**చిన్నచింతకుంట,సెప్టెంబరు06 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రి జి. కృష్ణారెడ్డి గురువారం కన్నుమూశారు. శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ ఇంటికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, నారాయణపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంభం శివకుమార్‌రెడ్డిలు పరామర్శించి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్‌ను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## పన్నులను సకాలంలో వసూలు చేయాలి

**-మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

**కల్వకుర్తి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** మున్సిపాలిటి అభివృద్ధికి పన్నులే ప్రధాన వనరులని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటి కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఆస్తి పన్ను మంచినీటి కొళాయి పన్ను, ఇతర పన్నులు 100 శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. నూతన భవన నిర్మాణం చేసుకునేవారు మున్సిపల్ సంఘం నుంచి అనుమతులు తీసుకొని భవన నిర్మాణాలు చేసుకోవాలని ప్రజలను కోరారు. పన్నుల చెల్లింపుకు మున్సిపల్ పరిధిలోని ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వీఎల్‌పీ రాజకుమారి, సీనియర్ అకౌంటెంట్ హిమబిందు, ఇంజనీర్, శానిటరి ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎస్సీ కాలనీ ఇళ్లలోకి వరద నీరు

**వరద నీటితో అవస్థలు పడుతున్న కాలనీవాసులు**



ఇంట్లోకి ప్రవేశించిన వరదనీరు

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** ప్రతి రోజు కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని ఉంద్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ఆరవ వార్డులోకి వరద నీరు రావడంతో కాలనీలోని పలు ఇండ్లు నీటిలో చిక్కుకున్నాయి. ఇళ్లలోని వరద నీరు చేరుకోవడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోయాయి. దీంతో వంట చేసుకోలేక పస్తులు ఉంటున్నామని ఎస్సీ కాలనీవాసులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు తొలగించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. ఇళ్లలోకి వరద నీరు రావడంతో పలు రోగాల బారిన పడుతున్నామని వెంటనే వరద నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ కాలనీ ప్రజలు కోరుతున్నారు. కాలనీలో వరదనీరు రావడంతో పలు ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఈ ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని తహసిల్దార్ కృష్ణయ్య తెలిపారు. నిదానంగావరదనీరు బయటికివెళ్తున్నాయని ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని ఆయన తెలిపారు. ఎస్సీ కాలనీలోని ప్రజలకు అక్కడనే భోజనం ఏర్పాట్లు చేయడంజరిగిందన్నారు. కాలనీ వాసులు ఇబ్బందులు కలగకుండా చూస్తామని తహసిల్దార్ తెలిపారు.

# మల్లమ్మ కుంట రిజర్వాయర్‌కు భూసేకరణ పూర్తి చేస్తాం

- అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి దృష్టి పెట్టారు
- కష్టపడ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది
- చత్తీష్ ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్, అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పక్కన నూతన చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్

**ఇటిక్యాల సెప్టెంబర్6 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు త్వరగా మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణ పనులకు 587 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం జీవోను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని అలాగే అల్లంపూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని కాంగ్రెస్ పార్టీ కోసంకష్టపడి ప్రతి నాయకునికి కార్యకర్తలకుగౌరవం దక్కుతుందని ఏఐసీసీ కార్యదర్శి చత్తీష్ ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అల్లంపూర్ మాజీ సంపత్ కుమార్ కార్యకర్తలకు వివరించారు.అల్లంపూర్ వివరించారు. అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ ఛత్తీష్‌ఘడ్ రాష్ట్ర ఇన్చార్జిగా నియమించగా బాధ్యతలు చేపట్టారు.అలాగే అల్లంపూర్ నియోజకవర్గ మార్కెట్ యార్డు చైర్మన్ వైస్ చైర్మన్ డైరెక్టర్లను ఎంపిక చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఆయన హైదరాబాద్ నుండి అల్లంపూర్ నియోజకవర్గానికి వస్తుండగా మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలోఅల్లంపూర్ మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, డైరక్టర్లు అలాగే స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, అల్లంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి లక్ష్మీనారాయణరెడ్డి, నీలి శ్రీనివాసులు,సోమనాద్రి, మాజీ జెడ్పిటిసి మద్దిలేటా. తనగల సీతారాంరెడ్డి, లక్ష్మీకాంతరావు, ఆయా మండలాల కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుండి భారీ ర్యాలీతో ఎర్రవల్లి చౌరస్తాలో గల ఆడిటోరియం వద్దకు చేరుకున్నారు.అల్లంపూర్ మార్కెట్ యార్డుగా ఎన్నికైన చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్ డైరెక్టర్లు నాయకులు కార్యకర్తలు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.అంతేకాక కొత్తగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను ఆయన సన్మానించారు. పెద్ద గజమాలతో కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఇంచార్జి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత కుమార్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ అల్లంపూర్ నియోజకవర్గంలోని మార్కెట్ యార్డు చైర్మన్ వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా నియామకంలో సామ్య సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని నియమించడం జరిగిందని జోగులాంబ ఆలయ కమిటీ జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ పోస్టులను నియమించే అవకాశం ఉందని వాటిలో పనిచేసే నాయకులకు కార్యకర్తలకు అవకాశం దక్కుతుందని కార్యకర్తలకు వివరించారు. కొత్తవారంరోజులుగా వర్షాలు భారీగా కురుస్తుండడంతో వర్షాలవల్ల వాగులు వంకలు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయని పంటలు నీటిలో మునిగి పంట నష్టం వాటిల్లిందని మూడు రోజుల్లోగా వ్యవసాయ అధికారులు రైతుల పంట నష్టం వివరాలను నమోదు చేస్తారన్నారు. రైతు ల పంటల నష్టపోతే వారికి ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చేందుకు అవకాశం ఉందని భరోసా ఇచ్చారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణాన్నికి సేకరణ కోసం ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా, కలిసినట్లు వారు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారని భూసేకరణకోసం సర్వేయర్లను కూడా నియమించినట్లు తెలి పారు.అల్లంపూర్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు భవనాలను నిర్మించేందుకు మంజూరు అయినట్లు నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ద్వారానే అమలు చేసేందుకు అవకా శం ఉందని వివరించారు. ఈ సమావేశంలో స్థానిక మండ లానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కే.రుక్మానందరెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు సిరాజ్, దేవేందర్, నాగరాజు, మద్దిలేటి యాదవ్, సోమిరెడ్డి,జయచంద్రారెడ్డి,ఇలియాస్, దేవరాజు, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,జైపాల్‌రెడ్డి, నియోజక వర్గంలోని మండలాల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అల్లంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే

## తహసిల్దార్ చేతుల మీదుగా కరపత్రాలు విడుదల



**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** సమాచారహక్కు చట్టం అవగాహన సదస్సు కరపత్రాలను శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలో తహసిల్దార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30రోజన సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటి తరపున నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నారాయణపేట అసెంబ్లీ అధ్యక్షులు గణేష్,అసెంబ్లీ నాయకులుగజలప్ప,సందకృష్ణతో పాటు పాల్గొన్నారు.

## మట్టివినాయక విగ్రహాల పంపిణీ

**కెటిదొడ్డి,సెప్టెంబరు 06 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల పరిధిలోని నందిన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రైస్ మిల్లు సూరి గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీ, బిసి కాలనీలో ఉన్న యూత్ సభ్యులకు తమ సొంత డబ్బులతో వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని వినాయకున్ని మంచి మనసుతో పూజిస్తే అనుకున్న కోరికలు తీరుతాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రైస్‌మిల్లు సూరి, మహదేవ్,ఎస్సీ కాలనీ యూత్ సభ్యులు, బిసి కాలనీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన రిలే దీక్షలు

**కృష్ణ,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** ముడుమాల్ దళితులను అవమానించి పెళ్లిని అడ్డుకున్న చక్రపాణిపై కేసు నమోదు చేసి దాదాపు 15 రోజులు గడుస్తున్న అరెస్టు చేయకపోవడం చూస్తుంటే బాధిత దళితుల పట్ల ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా కనబడుతుందని ప్రజా సంఘాల నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేస్తున్న దీక్షలు రెండో రోజుకు చేరాయి. చక్రపాణిని అరెస్టు చేసే వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ తెలిపారు. కార్యక్రమంలో నాగేష్, మద్దిలేటి,మానవ హక్కుల కార్యకర్త తిమ్మప్ప, అంబేద్కర్ యువజన సంఘంకృష్ణయ్య, బిఎస్పీ మోతిలాల్,కెవిన్‌పిఎస్ కర్రెప్ప, ఎమ్మార్పీఎస్‌మహెందర్,అశోక్,దేవేందర్,తిమ్మప్ప పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఘన సన్మానం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 06 ప్రభాతవార్త:** జర్నలిస్టులు సమాజ నిర్మాణానికి దోహదం చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తారని వాసవీక్లబ్ అధ్యక్షులు చిదిరే శ్రీనివాస్ అన్నారు. కల్వకుంట్ల చంద్రోన్ గుప్త జయంతి వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని వాసవీక్లబ్ భవన్‌లో జర్నలిస్టులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వ్యవహరిస్తున్నారన్నారని ఆయన తెలిపారు. జర్నలిస్టులు చిగుళ్లపల్లి శ్రీధర్, కొండూర్ కృష్ణయ్య, మిర్యాల రాజయ్య, కూన సంతోష్, పోల శ్రీధర్, కల్వ ఆంజనేయులు, శ్రీనివాస్‌లను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా బాధ్యులు కలిమిచెర్ల గోపాల్, ఇరువెంటి రమేష్, గుగ్గిల శంకర్, కోశాధికారి దుగ్గి అశోక్, అశోక్, నరసింహులు గుప్త, బాదం రాఘవేందర్, రవి, శివ, శ్రీనివాస్ ఉన్నారు.

## గంగమ్మకు పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్

**భూత్పూర్,సెప్టెంబర్6,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని మూడోవార్డులో ఉన్న కథాల్‌ఖాన్ చెర్వు శుక్రవారం నిండి అలుగు పారడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర నాయకులు చెర్వు వద్దకు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్‌అశోక్‌గౌడ్,గడ్డం ప్రేమ్,సత్తూర్ సురేష్‌గౌడ్,గడ్డం రాములు, వడ్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## లంబోదర నమస్తుభ్యం..

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరూ చూపి మురిసిపోతారని,ఇలా అవమానాల బారినుంచి తన ప్రజల్ని కాపాడాలని చంద్రుడు వినాయకుని వేడుకోగా,అప్పుడు గణపతి చవితి రోజున తన ప్రతిమను కొలిచిన వారికి అవమానాలుండవని సెలవిచ్చాడట.,నాటి నుంచి ప్రజలు వినాయకుడి పట్టిన రోజును వినాయక చవితిగా,చవితి రోజున పుట్టాడుకాబట్టి వినాయక చతుర్థిగాను ప్రతి హిందూవులు వినాయక చవితి రోజున వినాయక విగ్రహాలు, ప్రతిమలను ప్రతిష్టించుకుని విగ్రహాల ముందు గుంజీలు తీస్తూ మూడ్రోజుల నుంచి 41రోజుల వరకు పెద్ద పండుగను జరుపుతారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

◆ ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి : నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

**మక్తల్, సెప్టెంబరు06 ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నారాయణపేట ఎస్పీయోగేష్ గౌతమ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో గణేష్ నిమజ్జనం రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక పెద్దచెరువు వద్ద గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాట్లు పరిశీలించారు. గణేష్ నిమజ్జనం రోజు ఇతర వాహనాలు రోడ్డుపై వెళ్లడానికి మార్గాన్ని క్లియర్‌గా ఉంచాలని సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డుపై గుంతలు ఉన్న దగ్గర ప్యాచ్ వర్క్ చేయించాలన్నారు. గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసేవారు పోలీస్ పోర్టల్‌లో తప్పక నమోదు చేసుకోవాలని, అలా నమోదు చేసుకోవడం వల్ల వాటిని జియోటాగ్ చేయడంజరుగుతుందని, ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు చంద్రశేఖర్, రామ్‌లాల్,ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, తహసిల్దార్ సతీష్‌కుమార్, ఎంపిడిఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

◆ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్



తహసీల్దార్ వినతి పత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**తెల్కపల్లి,సెప్టెంబరు06 ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి, మిర్చి తదితర పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని వెంటనే ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వివిధ రకాల పంటలు నీట మునగడంతో పంటలను పరిశీలించారు. ఇదేగాక పొలాల్లో ఉన్న వరి కట్టలు తెగి పొలాల్లోకి ఇసుక మేటలు రావడం వరి పంట ఇసుక మట్టిలో కూరుకుపోవడంజరిగిందని అదే విధంగా చాలా గ్రామాల్లో లింకు రోడ్లు తెగిపోయి పరిస్థితులు దుర్భరంగా మారాయని వెంటనే ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు పత్తికి ఎకరాకు రూ. 20వేలు,వరికి రూ.30వేలచొప్పున నష్టపరిహా రాన్ని చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా వ్యవసాయ అధికారులు నిర్దిష్టంగాపంట నష్టపరిహారాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు రిపోర్టుచేయాలని కోరారు.అనంతరం పంటలు నీట మునిగిన సర్వే చేసిన అంశాలతో కూడినవినతి పత్రాన్నితహసిల్దార్ అందజేశారు. కార్యక్రమంలోసిపిఎం మండలకార్యదర్శినంది పేటభాస్కర్,సీనియర్‌నాయకులువిజయ్‌గౌడ్, గోపాస్ లక్ష్మణ్,జగదీష్,చిట్టయ్య, నాగయ్య పాల్గొన్నారు.

## ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అమరచింత పట్టణంలో డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

**అమరచింత సెప్టెంబర్6 ప్రభాతవార్త :** ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాల బారిన పడకుండా ఉంటారని అమరచింత మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మప్ప మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ అన్నారు. శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని నిర్వహించిన డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఆయా వీధిలలో అధికారులు కలియ తిరుగుతూ పిచ్చి మొక్కలను తొలగించి దోమల నివారణకు పిచికారి చేశారు. అలాగే ఆయన వీధులలో డ్రమ్ములు పాత టైర్లలో నిలువ నీటిని మున్సిపల్ సిబ్బంది పారదోలారు.పంట కాలం సీజన్లో టైఫాయిడ్ మలేరిఇయా విషజ్వరాలు వ్యాపిఇంచే అవకాశం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వారన్నారు. పట్టణంలోని డ్రైనేజీలలో మురుగు నీరుని శుభ్రపరచాలని ఆయన మున్సిపల్ సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు మున్సిపల్ అధికారులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్‌చేసి మొక్కలు నాటిన అభిమానులు**



కేక్ కట్ చేసి అరుణ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**కొల్లాపూర్,సెప్టెంబరు 06 ప్రభాతవార్త:** కొల్లాపూర్ భవిష్యత్ ఆశా కిరణం నిరుద్యోగ నిరుపేదలకు ఉపాధి మార్గాలను చూపిస్తున్న యువ నాయకులు రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు కొల్లాపూర్ పట్టణంలోని రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో కన్వీనర్ కేతూరి ధర్మ తేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌ను జూపల్లి కుటుంబ సభ్యురాలు జూపల్లి పుష్పమ్మ,మున్సిపల్ ఛైర్మన్,వైస్‌చైర్మన్ మేకలరమ్య, మహమూదాబేగం, కౌన్సిలర్లు పిన్నం శెట్టి జ్యోతి, మేకల శిరీషలు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జన్మదినవేడుకల సందర్భంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోవారసత్వ రాజకీయాలకు భిన్నంగా తనకంటూ పేరు ప్రఖ్యాతలు పొందుతూ రత్నగిరి ఫౌండేషన్ ద్వారా నిరుపేద, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారికి అండగా ఉంటూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలోప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులుయన్మన్‌బెట్లనాగరాజు,వనువుల నర్సింహ,పిన్నంశెట్టిశేఖర్,నయీమ్,మేకల రాముడు, కమలలాకర్‌రావు, అన్వర్, ఖాదర్‌పాషా,వంగ రాజశేఖర్‌గౌడ్, బొరెల్లి మహేష్, శివ, ఎల్లగౌడ్, సీఆర్పీఎఫ్ రమేష్, కబీర్, జగతి, చంద్రశేఖర్‌శెట్టి, కిరణ్,అఖిల్, వెంకట్‌రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

